క్లుప్తంగా

దిమిలిలో ఘనంగా పరదేశమ్మ పండగ



పరదేశమ్మ సన్నిధిలో కరణం ధర్మశ్రీ తదితరులు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో పరదేశమాంబ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరాలు. వర్షాలు తెరిపి ఇవ్వడంతో రైతులు సైతం ఉత్సాహంగా పండగలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీతో పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. పండగ సందర్భంగా సాంస్కృతిక, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పారిశుధ్యంతో ఆరోగ్యం

నక్కపల్లి: మండలంలో దోసలపాడు పంచాయతీలో శానిటేషన్ పనులను ఎంపీడీవో సీతారామరాజు మంగళవారం పర్యవేక్షించారు. క్లాప్ మిత్రల ద్వారా ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించే పనులు చేపట్టారు. వీధుల్లో చెత్తను తొలగించడం, మురుగు కాలువల్లో పూడిక తీత, సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించే పనులు ఆయన స్వయంగా పరిశీలించారు. డిప్యూటీ ఎంపీడీవో చలపతి రావు పాల్గొన్నారు.

కోటవురట్ల: కె.వెంకటాపురంలో పారిశుధ్య డ్రైవ్ మంగళవారం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు వీధుల్లోని చెత్తలను సేకరించి శుభ్రం చేశారు. డ్రైనేజీల్లో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. పారిశుధ్య పనులను వైఎస్సార్ సీపీ నాయకుడు పైల నాని పర్యవేక్షించారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ ఇంటి పరిసరాలతో పాటు వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను వీధుల్లో ఇష్టానుసారంగా వేయొద్దని కోరారు.

ఘనంగా గంగాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



మూలపేటలోని గంగాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని మూలపేటలోని గంగాలమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారు భాసిల్లడంతో పరిసర ప్రాంతాల భక్తులు తరలివచ్చి దర్శించుకొని పూజలు చేశారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు తగు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

సేవా దృక్పథం అలవాటు చేసుకోవాలి



రక్త దానం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు


పాయకరావుపేట: విద్యార్థులు సేవా దృక్పథం కలిగి ముందుకు సాగాలని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల 49వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ విద్యార్థులు 2004 నుంచి ఇప్పటి వరకు 2,300 యూనిట్ల రక్తాన్ని ఇచ్చి తమ సేవా నిరతి చాటుకున్నారన్నారు. మదర్ బ్లడ్ బ్యాంకు ప్రెసిడెంట్ జి.ఎల్.ఎల్. కిరణ్, రోటరీ బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టరు కామరాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎ.రామకృష్ణా రెడ్డి, డైరెక్టర్ హెచ్.ఆర్. డాక్టరు వి.వి.ఎస్.బి. బంగార్రాజు, వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్అండ్ఆర్ పనులు త్వరగా పూర్తి చేయాలి

నక్కపల్లి: బల్క్‌డ్రగ్ పార్క్ నిర్వాసితులకు సంబంధించి ఆర్అండ్ఆర్ పనులు త్వరగా పూర్తి చేయాలని నర్సీపట్నం ఆర్డీవో వి.వి. రమణ ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. బోదిగల్లం వద్ద ఆర్అండ్ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాల పనులపై ఆరా తీశారు. అదనపు భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీపై వచ్చిన ఫిర్యాదులు, అర్జీలపై విచారణ వంటి విషయాలపై చర్చించారు. డీటీ నారాయణరావు పాల్గొన్నారు.

యూత్ కమిటీ ఏర్పాటు

ఎస్.రాయవరం: సర్వసిద్ధి అంబేడ్కర్ యూత్ కమిటీ అధ్యక్షుడిగా మలిజెట్టి రమణారావు ఎన్నికయ్యారు. ఎస్.కల్యాణరావు అధ్యక్షతన మంగళవారం సర్వసిద్ధి గ్రామంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుగా కె. అచ్చారావు తదితర కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.



రూ.30 వేలు విలువ చేసే గణేష్ విగ్రహం

నా పేరు చిన్నారావు, మాది తుని సమీపంలో కుమ్మరి లోవ. పూర్వీకుల నుంచి విగ్రహాల తయారీ వృత్తిలోనే కొనసాగుతున్నాం. నేను నా కుటుంబ సభ్యులు నలుగురం కలిపి పాయకరావుపేటలో విగ్రహాల తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. రూ.5 లక్షల పెట్టుబడి పెట్టాను. విగ్రహాల తయారీ కోసం మరో 10 మంది కూలీలు పని చేస్తున్నారు. మా కుటుంబమంతా నాలుగు నెలల క్రితమే ఖాళీ స్థలాలను అద్దెకు తీసుకుని తాత్కాలికంగా గుడారాలు ఏర్పాటు చేసి విగ్రహాలు తయారు చేస్తున్నాం. నాతోపాటు మరో ఇద్దరు శిల్పులతో విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నాం. లేబర్‌కు రోజుకు రూ.వెయ్యి వేతనం చెల్లిస్తున్నాను. ఎక్కువగా ఆర్డర్‌పైనే తయారు చేస్తున్నాం. ఆర్డర్ లేకపోయినా చిన్న విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తాం. వాతావరణం అనుకూలిస్తే పర్వాలేదు. అన్ని విగ్రహాలు అమ్ముడయితేనే కష్టానికి తగ్గఫలితం దక్కుతుంది. అమ్మకపోతే నష్టపోవాల్సి వస్తుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలే కాకుండా మట్టివి విక్రయిస్తున్నాం. మా వద్ద కనిష్టంగా రూ.2 వేల నుంచి రూ.20 వేల విలువగల విగ్రహాలు అందుబాటులో ఉంటాయి.



మట్టిని తీసి బొమ్మకు ప్రాణం పోసి

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలపైనే మొగ్గు..

ఉత్సవ కమిటీలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహాలపైనే మొగ్గు చూపుతున్నాయి. తయారుదారులు వీటితోపాటు, కడియా మట్టితో తయారు చేసిన విగ్రహాలను విక్రయిస్తున్నారు. అడుగు నుంచి 12 అడుగులు, అంతకు పైన సైజుల్లో ఆకర్షణ, డిజైన్లలో విగ్రహం తయారు చేస్తున్నారు. డబ్బు కొద్దీ విగ్రహం అన్న రీతిలో రూ.2 వేల నుంచి రూ.20 వేలు విలువైన విగ్రహాలు అందుబాటులో లభిస్తున్నాయి.

- వినాయక చవితికి తయారవుతున్న విగ్రహాలు
- 200 మందికి 2 నెలల పాటు ఉపాధి
- శ్రీకాకుళం శిల్పులు, స్థానిక కూలీలతో పనులు
- రూ.2 వేల నుంచి రూ.20 వేల ధరలో
- అన్ని సైజుల్లో విగ్రహాలు అందుబాటులో..

నక్కపల్లి/పాయకరావుపేట: విఘ్నాలు తొలగించే వినాయకుని ప్రతిరూపాలు మెరుగులు దిద్దుకుంటున్నాయి. వినాయక చవితి దగ్గరపడటంతో గణేష్ విగ్రహాల తయారీలో శిల్పులు నిమగ్నమయ్యారు. ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా రెణ్నెల్ల ముందు నుంచే విగ్రహాలు తయారవుతున్నాయి. ప్రధానంగా పాయకరావుపేట, అడ్డురోడ్డు, యలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, అనకాపల్లి, మునగపాక, కశింకోట, తదితర జంక్షన్లలో ఏటా వందలాది విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తుంటారు. శ్రీకాకుళం నుంచి శిల్పులను తీసుకువచ్చి రోజువారీ కూలి చెల్లించి పాయకరావుపేట పరిసర ప్రాంతాల్లో తాత్కాలికంగా నివాసం ఏర్పాటు చేసి విగ్రహాలను తయారీ చేయిస్తున్నారు. స్థానికులతోపాటు తుని కుమ్మరివీధికి చెందిన కొంతమంది శిల్పులు వినాయక విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. గతంలో కాకినాడ, పెద్దాపురం, అనకాపల్లి, చోడవరం, సామర్లకోట, జగ్గంపేట తదితర ప్రాంతాలకు వెళ్లి విగ్రహాలను తీసుకొచ్చి వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. విగ్రహాల తయారుదారులు స్థానికంగా తాత్కాలిక గుడారాలు ఏర్పాటు చేసి విగ్రహాలను తయారుచేసి విక్రయించడంతో నిర్వాహకులకు విగ్రహాల కొనుగోలు సులభతరమైంది. గతంలో విగ్రహం కొనుగోలు, రవాణా ఖర్చులు తడిపిమోపెడయ్యేవి. ఇప్పుడయితే ఈ ఖర్చులన్నీ మిగులుతున్నాయి. పాయకరావుపేట పరిసర ప్రాంతాల వారు పాయకరావుపేటలోను, నక్కపల్లి ఎస్.రాయవరం మండలాలవారు అడ్డురోడ్డు జంక్షన్‌లో తయారయ్యే విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. పెద్ద విగ్రహాలయితే వ్యాపారులు ఆర్డరుపై బయానా తీసుకుని మాత్రమే తయారు చేస్తున్నారు.



అమ్మకానికి సిద్ధం చేసిన గణేష్ విగ్రహాలు

గణపతి, దేవీ నవరాత్రులకే ఉపాధి ...

గణపతి, దేవీ నవరాత్రుల సందర్భాల్లోనే ఉపాధి ఉంటుందని, వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణ చేస్తుంటామని తయారుదారులు చెబుతున్నారు. ముడిసరుకు, తయారీ ఖర్చు, కూలీల చార్జీలు పోను రూ.2 వేలు దాటిన ఒక్కో విగ్రహం వద్ద రూ.300 నుంచి రూ.500, రూ.10 వేలు దాటిన విగ్రహం వద్ద రూ.3 వేలు వరకు మిగులుతుందన్నారు. ఒక విగ్రహం రూపుదిద్దుకోడానికి నెల రోజులు సమయం పడుతోంది. విగ్రహం తయారు చేసే కూలీలకు రోజుకు రూ.వెయ్యి వేతనం చెల్లిస్తామని దుకాణాల యజమానులు చెబుతున్నారు. శ్రీకాకుళం నుంచి ప్రత్యేకంగా శిల్పులు, విగ్రహ తయారుదారులను తీసుకొస్తామన్నారు. ఒక్కో గుడారం వద్ద వందల సంఖ్యలో విగ్రహాలు అమ్ముడవుతుంటాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే వ్యాపారం బాగా సాగుతుంది. వర్షాలు పడితే ఆర్డర్లు వచ్చిన ప్రాప్తికే విగ్రహాలు తయారు చేస్తారు. అడుగు నుంచి 3 అడుగుల విగ్రహాలైతే మట్టితోనే తయారు చేస్తారు. ఒక్కో తయారీ కేంద్రం వద్ద 10 నుంచి 15 మంది పనిచేస్తున్నారు. పాయకరావుపేట, ఎలమంచిలి, అడ్డురోడ్డు ప్రాంతాల్లో 200 మంది కార్మికులు పని చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.



విగ్రహాలకు మెరుగులు దిద్దుతున్న కూలీలు

కురసాల కన్నబాబుకు పరామర్శ



సత్యనారాయణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న కంబాల, చిక్కాల తదితరులు

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ మాజీ మంత్రి కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ మంగళవారం ఉదయం మరణించారు. ఈ సమాచారం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి బొడ్డేడ ప్రసాద్, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు, తదితరులు కాకినాడ వెళ్లి సత్యనారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కన్నబాబు కుటుంబాన్ని ఓదార్చారు. ఈ పరామర్శలతో పార్టీ మండలాధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, సీనియర్ నాయకులు ధనిశెట్టి బాబూరావు, జగతా భవానీ శ్రీనివాస్, పైల రమేష్, గెడ్డమూరి శ్రీను బచ్చలరాజు, తదితరులు ఉన్నారు. కాగా సత్యనారాయణ మృతి పట్ల కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, నక్కపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎంపీపీ రత్నం, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు, సీనియర్ నాయకులు మణిరాజు, పాపారావు, గొర్ల గోవిందు, భార్గవ్, తిరుపతిరావు, ఎల్లేటి సత్తిబాబు తదితరులు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పంచాయతీ దారులకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

అచ్యుతాపురం రూరల్: ఆర్ అండ్‌బీ అధికారుల చొరవతో ప్రభుత్వ కార్యాలయాల వైపు రోడ్లపై గోతులు పూడ్చినట్లు అచ్యుతాపురం పంచాయతీ సెక్రటరీ శైలజ తెలిపారు. 'భారీ వాహనాలతో పంచాయతీ రోడ్లు ఛిద్రం' అనే శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించి మంగళవారం అధికారులు మరమ్మతులు చేపట్టారు. పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలు పంచాయతీ దారుల్లో కాకుండా ప్రత్యామ్నాయం చూసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణంపై వినతి



ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం జడ్. చింతువ శివారు గజిరెడ్డిపాలెంలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మించాలని వైఎస్సార్ సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి వై.చక్రవర్తి ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు.

త్వరలో వైఎస్సార్‌సీపీ మండల, గ్రామ కమిటీలు

పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీ మండల, గ్రామాల కమిటీలు త్వరలో నియమిస్తామని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని ఉన్నవారికి రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలకు ఏడాది పాలనలో ప్రజలు విసుగుపోయారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పెట్టి ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టారన్నారు. బస్సులో ప్రయాణించే మగవారికి సీట్లు లేకుండా ఉంటున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏ పథకం ప్రవేశ పెట్టినా అన్ని వర్గాల వారికి సమన్యాయం చేసే పరిస్థితి లేదన్నారు. చాలా మందికి తల్లికి వందనం నగదు రాని పరిస్థితి ఉందన్నారు. అన్నదాత సుఖీభవ పరిస్థితి అలానే ఉందన్నారు. ఉచిత గ్యాస్ ఎన్ని ఇచ్చారో, ఎవరికి ఇచ్చారో వారికే తెలియదన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజ లు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అప్పుడు మరలా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే అందరికీ మంచి భవిష్యత్తు ఉంటుందన్నా రు. వైఎస్సార్ సీపీ శ్రేణులపై కూటమి నేతల వేధింపులు మరింత పెరిగాయన్నారు. వాటిని తిప్పి కొట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ, వైస్ ఎంపీపీ చోడి పల్లి అప్పన్న, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షు డు కర్రి సత్యనారాయణ, యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, నాయకులు అల్లాడ నాగరాజు, అద్దేపల్లి నూకునాయుడు, చొప్పా రాజు, పాలుమూరి అప్పలరాజు, పిట్ల నాయుడు, వైబోయిన సత్యనారాయణ, తూము బుచ్చిబాబు, వీసం ప్రకాష్, దార్లపూడి శ్రీను, చేకూరి అశోక్‌రాజు, నక్కా నాగేశ్వరరావు, గరగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురిపై కేసు

యలమంచిలి రూరల్: పట్టణంలోని రైల్వే స్టేషన్ కేఆర్ఆర్ లాడ్జిలో మంగళవారం రాత్రి పేకాడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై కే సావిత్రి తెలిపారు. లాడ్జిలో తనిఖీకి వెళ్లిన పోలీసులకు రూమ్ నెంబర్ 201లో డబ్బులు పణంగా పెట్టి పేకాడుతున్న యువకులు కనిపించారు. వీరి నుంచి రూ.29,300, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనపర్చుకున్నారు. నిందితులు తెరువుపల్లి, నారాయణపురం, కట్టుపాలెం గ్రామాలకు చెందిన వారుగా గుర్తించారు.

మోదకొండమ్మ తల్లి ఆలయానికి విరాళం

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో మోదకొండమ్మ తల్లి ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు ఈ నిర్మాణానికి అవసరమయ్యే సాయం అందజేస్తున్నారు. మంగళవారం వాడ్రాపల్లికి చెందిన కొయిలాడ శ్రీనివాస్, శివలక్ష్మి దంపతులు రూ.10 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో 20 నుంచి 30 పింఛన్ల కోత

- సీఎం చంద్రబాబు పాలనంతా మోసాలే..
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ
- యలమంచిలి పట్టణంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ



యలమంచిలిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

యలమంచిలి రూరల్: సీఎం చంద్రబాబు పాలనంతా అబద్ధాలు, మోసాలే అని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన దాఖలాలు లేవని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ విమర్శించారు. మంగళవారం యలమంచిలి పట్టణంలో 12, 13, 14, 15, 16 వార్డుల్లో బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. సిగ్గు లేకుండా సూపర్-6 సూపర్ హిట్ అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సూపర్-6 సూపర్ ఫట్ అని, ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. మహిళల పేరుతోనే పథకాలు అమలు చేశారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా సామాజిక భద్రతా పింఛన్లు తీసుకుంటున్న లక్షలాది మంది లబ్ధిదారులకు కోత పెడుతున్నారన్నారు. ప్రతి గ్రామంలో 20 నుంచి 30 మంది పింఛన్లను తొలగిస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నారన్నారు. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. ఎన్నికల ముందు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకించినట్టు నటించి ఓట్లు వేయించుకున్న తర్వాత ఇప్పుడు 34 విభాగాలను ప్రైవేటీకరిస్తున్నారని విమర్శించారు. క్రమంగా స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి కుట్ర చేస్తున్నట్టుగా ప్రజలు భావిస్తున్నారన్నారు. ఇప్పటికే జిల్లాలో చక్కెర కర్మాగారాలు మూతపడ్డాయని, చోడవరం చక్కెర కర్మాగారం వెంటిలేటర్‌పై ఉందన్నారు. ప్రతిపక్షంలో పార్టీ కోసం ఎవరైతే కష్టపడి పని చేస్తారో.. భవిష్యత్తులో అటువంటి నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు ఎర్రయ్యదొర, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణిరాము, నెట్టెం సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పలివెల అమృతవల్లి, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వర్రావు, అర్రెపు గుప్తా, పిల్లా త్రినాథరావు, దూది నర్సింహమూర్తి, కొఠారు కొండబాబు, ఈరిగిల గణేష్, గొంపాని అప్పారావు, గొంపాని శివ, పండూరి శ్రీను, గారా సత్తిబాబు, తెరపల్లి నర్సింగు, లొట్ల శంకర్రావు, డబ్బీరు రవి, తుపాకీ గోవింద్, మర్రి రాజు, ఉప్పులూరి కిరణ్, కరణం పండు, రాపేటి సంతోష్, కార్యకర్తలు పాల్గొన్నారు.